క్లుప్తంగా

హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీ.మల్లయ్య తెలిపారు. 2002 నుంచి నిబంధనల ప్రకారం జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కీలకమైన విధులను చేపట్టామని తెలిపారు. 22ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. ఈ నెల 15న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు కనీస భద్రత కరవు


విజయ జ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు కనీస భద్రత లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్ల చిన్నారి తనకు బంధువైన వ్యక్తి చేతిలో హత్యాచారానికి గురవడం రాష్ట్ర ప్రజలందరినీ కలచివేసిందన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో 17ఏళ్ల లహరిపై లైంగిక దాడి, వైఎస్ఆర్ జిల్లా వేములలో ఓ మహిళపై హత్యాయత్నం ఘటనలు, మహిళల భద్రత వైఫల్యాన్ని వెల్లడిస్తున్నాయన్నారు. రాజకీయ విమర్శలు చేయడం మినహా, మహిళలకు భద్రత కల్పించడంలో హోం మంత్రి పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై నిత్యం 50 నుంచి 60 అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. హోం మంత్రి అనిత చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

గుంత పూడ్చివేత



గుంతను పూడ్చి వేయిస్తున్న రిమ్స్ పీఎస్ ఎస్ఐ జయరాములు

కడప అర్బన్: కడప నగర శివారులోని జేఎంజే కళాశాల సమీపంలో రోడ్డుపై గుంతను రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ జయరాములు తమ సొంత ఖర్చులతో కాంక్రీట్ వేయించి పూడ్చి వేయించారు. ఈ నెల 10వ తేదీ తెల్లవారు జామున అదే ప్రాంతంలో గుంతను తప్పించబోయి రెండు లారీలు ఢీకొన్నాయి. ఇలాంటి ప్రమాదం పునరావృతం కాకుండా తమ వంతుగా పోలీసులు గుంత పూడ్చివేయించారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి కౌశల్ 2024 పోటీలకు నందిని ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నందిని

కమలాపురం : ఈనెల 29, 30 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్-2024 ప్రతిభాన్వేషణ పరీక్షకు కమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎస్.యోగ నందిని అర్హత సాధించిందని హెచ్ఎం సరస్వతి తెలిపారు. ఈనెల 6న జరిగిన జిల్లాస్థాయి కౌశల్-2024 ఆన్‌లైన్ పరీక్షలో పోస్టర్ విభాగంలో నందిని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వివరించారు. కాగా నందినిని బుధవారం హెచ్ఎంతో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు నాగ మునెయ్య, ఇతర ఉపాధ్యాయునులు అభినందించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : ఈ నెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లోక్ అదాలత్‌లో భాగంగా కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో కూడా ఈ అదాలత్ నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రాజీకి వీలయ్యే సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు వెంటనే పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

ప్రొద్దుటూరు రూరల్: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వెంటనే బీమా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్ రెడ్డి కోరారు. మండలంలోని ఉప్పరపల్లె రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు విస్తరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు వేసేలా రైతును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో రైతు సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు అవసరమైన సూచనలిస్తామన్నారు.

ఆలోచన తట్టి.. బండికి కట్టి



ఇంటిల్లిపాదికీ కడుపు నిండాలంటే కాసింత కష్టపడాల్సిందే. ఏదో ఒక వృత్తి చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిందే. దీనిని అందిపుచ్చుకొన్న కొందరు వినూత్న ఆలోచనలతో వ్యాపారం చేస్తూ రాణిస్తున్నారు. ఇందులో భాగంగానే ఓ యువకుడు నిత్యం దొబ్బుడు బండితో వ్యాపారాలు చేస్తున్నాడు. అయితే దానిని తోసుకెళ్లడం కొంత ఇబ్బంది అనిపించిందేమో.. ఆలోచనకు పదును పెడితే అలా తట్టింది.. కడప బాలాజీ నగర్ వద్ద వెంటనే బండికి కట్టి ఇలా తీసుకెళ్లాడు.. అయితే ముగ్గురితో వెళ్తున్న ప్రమాదాన్ని గుర్తించలేదు. తీసిన చిత్రం ఇదీ. – సాక్షి ఫొటోగ్రాఫర్

ఇంట్లో చదువుతాం.. ఇంటికి చేరుస్తాం





ఉక్కు నరాలు కలిగిన యువత ముందడుగు వేయాలంటూ స్వామి వివేకానంద చెప్పారు. దీనిని అందిపుచ్చుకొన్నారేమో మరి.. యువకులు ఇంట్లో ఉంటూ చదువు కొనసాగిస్తూనే ఖాళీ సమయంలో నిత్యం వారి కష్టాలు మరచి ఇలా సరకులు ఇంటికి చేరుస్తూ శ్రమపడుతున్నారు. ప్యాకెట్ మనీ కోసం స్విగ్గి, జొమాటో, ఈకార్ట్, ఈ కామర్స్ మార్కెటింగ్ కంపెనీలలో పార్టటైమ్ జాబ్ చేస్తున్నారు. వీరిలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు కూడా ఉన్నారు. కడప నగరంలో కనిపించిన దృశ్యాలు కెమేరాకు చిక్కాయి. – సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష


అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేరళ రాష్ట్రంపై వివక్ష చూపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం కేరళపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తొక్కిపెడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి బీజేపీ ప్రభుత్వం విఘాతం కల్పిస్తోందన్నారు. త్రివేండ్రం విమానాశ్రయాన్ని అదానీకి అప్పగించిందని, రాష్ట్ర ప్రభుత్వమే కొంటామని చెప్పినా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందన్నారు. ఎక్కడా లేని విధంగా వయనాడ్ కొండ చరియలు విరిగిపడి 400మంది మరణించినా, వంద మంది అచూకీ నేటికీ తెల్చలేదన్నారు. కక్షపూరిత చర్యలు విరమించి చట్ట ప్రకారం రావాల్సిన వాటిని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు దస్తగిరిరెడ్డి, మనోహర్, గోపాలకృష్ణయ్య చంద్రారెడ్డి, నరసయ్య, రమణ, సురేష్, గోవిందు, విజయ్, రవి పాల్గొన్నారు.

పాఠశాలల వాచ్‌మెన్లకు వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న కెసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. నగరంలోని హొచిమిన్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి గొప్పలు చాటుకున్నదేగానీ, ఆయాలు, వాచ్‌మెన్ల గోడు పట్టించుకోలేదన్నారు. నెలంతా పనిచేసినా సకాలంలో వేతనం ఇవ్వకుండా సర్కారు ముప్పుతిప్పలు పెడుతోందన్నారు. ఒకటో తారీఖున జీతాలిస్తామన్న ప్రభుత్వం 5, 6 నెలల వేతనాలు ఇవ్వకపోతే క్రిస్మస్, సంక్రాంతి పండగలు ఎలా జరుపుకొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచడానికి ఏడేళ్లకు పైబడి పనిచేస్తున్న వారికి గతంలో అమ్మఒడి నిధుల నుంచి రూ.6 వేలు ప్రతినెలా చెల్లించారన్నారు. కూటమి ప్రభుత్వం వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వీపర్స్‌పై రాజకీయ వేధింపులు లేకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి సమదుస్తులు ఇచ్చి.. సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

చాపాడు : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామాల్లోని సాగునీటి సంఘం ఎన్నికలు ఈనెల 14న నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్‌ను ఆయా ఎన్నికల నిర్వహణ కేంద్రాల వద్ద ప్రదర్శించారు. మండల పరిధిలో 10 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కెనాల్ పరిధిలోని దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాలతో సంబంధం ఉన్న మండలంలోని నీటి సంఘాలకు సైతం ఒకే రోజున ఎన్నిక నిర్వహించనున్నారు. దువ్వూరు కేసీ కెనాల్ పరిధిలోని 62 అన్నశాస్త్రులపల్లె, 63 మడూరు, 64 చియ్యపాడు, మైదుకూరు కేసీ కెనాల్ పరిధిలో 67 మడూరు, 68 ఉప్పరపల్లె, 69 అనంతపురం, 70 అనంతపురం, 71 సోమాపురం, 74 అల్లాడుపల్లె, 75 మిడుతూరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నిటిలో ఒక సంఘానికి ఒక్కో చైర్మన్‌ను ఓటర్లు ఎన్నుకుంటారని, సాగునీటి సంఘాల చైర్మన్లు అందరూ మండల చైర్మన్ ఎన్నుకోనున్నారు. 63వ సంఘానికి అన్నవరం జెడ్పీ హైస్కూల్‌లో, 64 సంఘానికి చియ్యపాడు జెడ్పీ హైస్కూల్‌లో, 67 సంఘానికి మడూరు గ్రామ సచివాలయం, 69వ సంఘానికి చాపాడు ఎంపీడీఓ కార్యాలయం, 70వ సంఘానికి చాపాడు జెడ్పీహైస్కూల్, 71వ సంఘానికి సోమాపురం గ్రామ సచివాలయం, 74వ సంఘానికి లక్ష్మీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహిస్తారు. 68వ సంఘానికి ప్రొద్దుటూరులో, 75వ సంఘానికి ఖాజీపేట, 62వ సంఘానికి దువ్వూరు మండలంలో ఎన్నిక చేపట్టనున్నారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం



ఆలయ మాడవీధుల గుండా ఊరేగుతున్న మోక్ష నారాయణ స్వామి , అలంకరణలో స్వామి

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం మార్గశిర శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు జగదీష్ శర్మ ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే రవి యోగం, భద్రావస్ యోగం కలసి రావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నంచి భక్తులు మోక్ష నారాయణ స్వామి ఆలయానికి తరలివచ్చారు. ప్రతి నెల ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా హరి హరాదులను దర్శించుకునే ఆలయం కావడంతో భక్తులు విరివిరిగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిత్య కళ్యాణాలు చేశారు. సాయంత్రం రథంపై స్వామిని కొలువుంచి ఆలయ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మాటలే.. దుమ్ము తీయటాల్లేవ్



కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో రహదారులపై దుమ్ము, ధూళి తొలగింపునకు ఉపయోగించే యంత్రం ఇది. లక్షల రూపాయలతో కొనుగోలు చేసి సిబ్బందికి అప్పగించారు. నిత్యం ఉదయాన్నే దారులన్నీ క్లీన్ చేయాల్సి ఉంది. కానీ గత పది రోజులుగా ఇలా చుట్టపు చూపుగా దుమ్ము తొలగిస్తున్నారు. సెల్‌ఫోన్ డ్రైవ్ చేస్తూ వాహనం ఇలా నడుపుకుంటూ వెళ్లిపోయిన ఈ చిత్రం సాక్షి కెమెరాకు చిక్కింది.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

పీహెచ్‌సీ తనిఖీ


చౌటపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి లక్ష్మా నాయక్

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్ తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డెంగీ, చికెన్ గున్యా పాజిటివ్ కేసులు నమోదు అయిన బుడ్డాయపల్లె, చౌటపల్లె గ్రామాలను సందర్శించారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలు తప్పని సరిగా వాడాలన్నారు. సాయంత్రం పూట ఇంటి అవరణంలో వేప ఆకుతో పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కడపలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డి సర్కిల్: నిరుద్యోగులకు బాసటగా.. ఈ నెల 13వతేదీన కడప నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాలో ఫాతిమా మెడికల్ కళాశాలలో డ్యూటీ మెడికల్ ఆఫీసర్(4-5 సంవత్సరాల అనుభవం), ఏటీ ఇన్‌ఛార్జి, నర్సింగ్ సూపర్‌వైజర్స్, స్టాఫ్ నర్స్, అనస్థీషియా టెక్నీషియన్, స్లీప్ ల్యాబ్ టెక్నీషియన్, ఆడియో మెట్రిక్ అండ్ స్పీచ్ థెరపిస్టు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. దీంతో పాటు ట్రియో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్ ఇంజినీర్, క్వాలిటీ ఇంజినీర్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్లు, ఎస్‌బీఐ కార్డ్స్‌లో బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ మొదలుకొని పీజీ వరకు అర్హతగల నిరుద్యోగులు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు 19 నుంచి 50 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికై వారి హోదాను బట్టి రూ. 11 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

నేడు జమ్మలమడుగులో

జమ్మలమడుగు పట్టణం మున్సిపల్ కార్యాలయం వద్ద గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సురేష్‌కుమార్ తెలిపారు. ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో వెల్డర్, హెల్పర్, ఫిట్టర్ ఉద్యోగాలకు, ఎల్ఐసీ ఆఫ్ ఇండియాలో ఎల్ఐసీ అడ్వయిజర్, ఆర్‌సీఏలు, సీసీఏ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివి ఉండాలన్నారు. అభ్యర్థులు 18-35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి 21 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అర్హత గల వ్యక్తులు ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

ప్రొద్దుటూరు: ఈ నెల 12, 13వ తేదీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఉంటుందని తెలిపారు.

రికార్డుల్లో మార్పులపై విచారణ చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో 2019కి ముందు, అనంతరం రెవెన్యూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర విచారణ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా, అధికార పార్టీ వేదికలుగా మారుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సదస్సు జరిగే ప్రాంతాల తేదీ, సమయం, వివరాలను ముందస్తుగా ప్రకటించాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి 22ఏ చట్ట సవరణ అడ్డం పెట్టుకొని అసైన్‌మెంట్ భూములు కొట్టేసేందుకు తప్పుడు పత్రాలు సృష్టించిన అక్రమార్కులు, వారికి మద్దతు పలికిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్‌హెచ్‌డీసీ, సొసైటీల ద్వారా గతంలో ఇచ్చిన భూములపై అనుభవంలో ఉన్న వారసులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరుచేయాలన్నారు. దశాబ్దాల తరబడి అనుభవంలో ఉన్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించేలా సూచిక బోర్డులు, కంచె వేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీబాదుల్లా, గంగా సురేష్, శంకర్‌నాయక్, లింగన్న పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఆహార కల్తీ శాఖ భవనం



శిథిల భవనంలో కొనసాగుతున్న ఆహార కల్తీ నియంత్రణ శాఖ, పెచ్చులూడిన పైకప్పు

కడప రూరల్ : నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న ఆహార కల్తీ భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారుతోంది. కీలకమైన ఆహార కల్తీ నియంత్రణ శాఖ కార్యాలయంలో ఆ శాఖకు చెందిన ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే భవనం పెచ్చులూడి కింద పడుతుందని చెబుతున్నారు. వర్షాకాలంలో నీరు చేరి చిత్తడిగా మారుతుండడంతో.. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం మరమ్మతులు చేయించాలని, లేదా సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని వారు కోరుతున్నారు.

చింతకొమ్మదిన్నెలో.. పొలం పిలుస్తోంది


బుగ్గలపల్లెలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె, బోదేద్దులపల్లె గ్రామాల్లో నిర్వహించన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. రబీ 2024 వరి పంటకు మాత్రమే డిసెంబర్ 31 వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుటకు అవకాశం ఉందని, మిగిలిన పంటలకు మినుము, జొన్న, నువ్వులు, పొద్దు తిరుగుడు, పెసర, సెనగ, వేరుశనగలకు డిసెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని గుర్రంపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యాన అధికారి జ్యోతిర్మయి పాల్గొని మాట్లాడారు. మామిడిలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. వర్షాల వలన ఇప్పుడు శాఖీయ పెరుగుదల ఎక్కువగా (కొత్త ఆకులు) కనిపిస్తుంటే, దాని నియంత్రణకు సైకోసెల్ 1-2 మీ.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి. తేనె, మంచు పురుగు నివారణకు పూతకు నెల రోజుల ముందు వేపనూనె 3 మీ.లీ లేదా క్లోరోపైరిఫాస్ 2 మీ.లీ కలిపి కాండం కూడా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పూత మొదలగు సమయంలో, ఇమిడాక్లోప్రిడ్ 0.3 మీ.లీ, కార్బెండిజం 1గ్రా/లి. 13:0:45 10గ్రా/లి. పిచికారీ చేసుకోవాలి. ప్రతి పిచికారీ వేపనూనె 3మీ.లి/లి. మరియు జిగురు మందు 0.5 మీ.లి /లి. కలిపి పిచికారీ చేయాలి. పూతని ప్రేరేపించడానికి, ఆడ పూల సంఖ్య పెంచడానికి 13:0:45 10గ్రా/లి., బోరాన్ 2గ్రా/లి. నీటికి కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మ పోషక మిశ్రమం 5 గ్రా/లి. నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకు తినే గొంగళి పురుగు నివారణకు ఎమమేక్టిన్ బెంజోయట్ 0.4గ్రా /లి. మరియు వేప నూనె 3-5 మి.లి. /లి. నీటికి కలిపి పిచికారి చేయాలి అని తెలియజేశారు.

వైవీయూ: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలకు వచ్చే చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలని కడప మండల వ్యవసాయాధికారి ఎస్.వి. సురేష్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కడప మండల పరిధిలోని గూడూరు గ్రామంలో సాగుచేసిన వేరుశనగ, మినుము, నువ్వుల పంటలను బుధవారంఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితికి తగ్గట్టుగా నివారణ చర్యలు తీసుకోవాలని చెబుతూ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. శనగ, మినుము, నువ్వులు, వేరుశనగ పంటలు వేసిన రైతులు పంటల బీమా కోసం ఈ నెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. అదే విధంగా వరి పంట వేసిన రైతులు డిసెంబర్ 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాట్. సెంటర్ కోఆర్డినేటర్ డా.అంకయ్యకుమార్, ఏఈఓలు ఐ.పావని, ఎస్. మెహరాజ్, రైతులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం కాశినాయన

14 నుంచి 28వ ఆరాధన మహోత్సవం
ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


పత్తూరులోని కాశిరెడ్డినాయన ఆలయం


భూదేవి, కృష్ణుడు, వినాయక విగ్రహాలు

ఖాజీపేట : మండలంలోని పత్తూరు గ్రామంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల నమ్మకం. ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కాశినాయన ఆరాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 27వ ఆరాధన ఉత్సవాలు కావడంతో భక్తులు స్వామి దర్శనంకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. 14 వతేదీన ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు మహాగణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహ దేవతలకు ప్రత్యేక పూజలు ఉంటాయి. అలాగే సమరసత సేవాసమితి ఆధ్వర్యంలో చెక్కభజన రాత్రి 8 గంటల వరకూ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి చెంచులక్ష్మి నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 7 గంటలకు కాశిరెడ్డినాయన మహా నైవేద్య సమర్పణ జరుగుతుంది. ఉదయం 10 గంటలకు హరినామ భజన ఉంటుంది. దీంతో ఆరాధన ఉత్సవాలు ముగుస్తాయి.

బండలాగుడు పోటీలు

ఉత్సవాలను పురస్కరించుకుని 14వ తేదీన బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30వేలు నాలుగోవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలుగా నిర్ణయించారు. న్యూ క్యాటగిరి విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.